క్లుప్తంగా

ఉధృతంగా వేదావతి


గూళ్యం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నది

హాలహర్వి: కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో ఆదివారం కురిసిన వర్షాలకు ఆంధ్ర సరిహద్దులోని వేదావతి నది ఉప్పొంగింది. దీంతో మండలంలోని గూళ్యం, జె.హొసళ్లి, బల్లూరు, అమృతాపురం గ్రామాల్లోని పంట పలాలు నీట మునిగాయి. విద్యుత్ మోటార్లు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. చేతికొచ్చే సమయంలో పంట మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా కర్ణాటక రాష్ట్రంలోని ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో వేదావతి నదికి వరద పోటెత్తింది. ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలూరు రూరల్: వాతావరణ మార్పులతో ప్రబలే సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం ఆలూరు సచివాలయ-1 పరిధిలోని వైద్యారోగ్య సిబ్బంది విష జ్వరాలపై అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు, వృద్ధులకు మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవద్దని సూచించారు. మంచినీటిని కాచి చల్లార్చి వడబోసి తాగాలన్నారు. రోజు విడిచి రోజు జ్వరం, తలనొప్పి, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని తెలిపారు.

వాటర్ షెడ్ పనులతో రైతులకు ప్రయోజనం


మాట్లాడుతున్న పీఓ వలిబేగ్


హాలహర్వి: వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనులతో రైతులకు అధిక ప్రయోజనం కలుగుతుందని ప్రాజెక్టు పీవో వలిబేగ్ తెలిపారు. సోమవారం మండలంలోని బాపురం గ్రామ సచివాలయంలో గ్రామ నూతన కమిటీని ఎంపిక చేశారు. చైర్మన్‌గా ముత్తన్నగౌడ్, వైస్ చైర్మన్‌గా లక్ష్మితోపాటు 11 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. రైతులకు వ్యవసాయ పనులు, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులు కమిటీ పర్యవేక్షణలో జరుగుతాయని పీఓ తెలిపారు.

యోగా పోటీల్లో రాణించిన కేజీబీవీ విద్యార్థినులు


విద్యార్థినులకు షీల్డ్ అందిస్తున్న మంత్రి భరత్

కృష్ణగిరి: మూడు రోజులుగా కర్నూలులోని ఇండస్ పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి 5వ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు సోమవారం సత్తాచాటారు. కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రేవతి, ఆస్పరి కస్తూర్బా విద్యాయలంలో ఇంటర్ విద్యార్థిని పల్లవి గ్రూపు విభాగంలో మూడవ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ చైతన్య ప్రవంతి తెలిపారు. విద్యార్థినులకు మంత్రి టీజీ భరత్ షీల్డ్ అందజేసి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన కుమారుడిని లేపేందుకు ప్రయత్నిస్తున్న తల్లి లక్ష్మి

హాలహర్వి: మండల కేంద్రం సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు గాయపడ్డారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రంలోని మోకా గ్రామానికి చెందిన కుమారుడు ఉలిగప్ప, తల్లి లక్ష్మి ఆలూరు మండలం అరికెర గ్రామంలో బంధువు మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంత్యక్రియలు ముగించుకుని బైకుపై స్వగ్రామానికి బయలుదేరారు. హాలహర్వి పెట్రోల్ బంకు సమీపంలో పశువులు అడ్డుగా రావడంతో ఉలిగప్ప అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బైకు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో తల్లి లక్ష్మికి స్వల్ప గాయాలు కాగా, ఉలిగప్పకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అటుగా వెళ్తున్న వారు హాలహర్వి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉలిగప్పను బళ్లారి ఆస్పత్రికి తరలించారు.

మార్పిడితో మేలు


పంట సాగు కోసం పొలాన్ని చదును చేస్తున్న రైతు

- పంట మార్పిడితో భూసారం వృద్ధి, పెరగనున్న దిగుబడి
- ఏటా ఒకే పంట సాగు చేస్తే నేలకు, రైతుకు నష్టం
- చీడపీడల ఉధృతి, కలుపు బెడద

ఆలూరు రూరల్: ఒకే పొలం.. ఒకే రకమైన పంట.. ఏటా ఇదే పద్ధతిలో సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గిపోతున్నాయి. పైరు ఎదుగుదల లోపించి.. చీడపీడల ఉధృతి అధికంగా ఉండటంతో దిగుబడి అంతంత మాత్రంగానే వస్తోంది. దీంతో పంట మార్పిడి చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకే పొలంలో వేర్వేరు పంటలను ఒక క్రమంలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడితో ప్రకృతి వనరులను సమర్థవంతంగా వాడుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అత్యధిక లాభం పొందే అవకాశం ఉంది. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 54 వేల హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేయనున్నారు. ఈ ప్రాంతంలో ఏటా రబీ సీజన్‌లో అత్యధికంగా పప్పు శనగతో పాటు వాము, జొన్న తదితర పంటలు సాగు చేస్తారు. 70 శాతం మంది రైతులు శనగ పంట సాగుచేస్తారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల తర్వాత ఈ ప్రాంతంలోనే శనగ పంట అత్యధికంగా సాగవుతుంది. రబీ సీజన్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడిని పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇప్పటికీ సీజన్ వారీగా ఒకే రకమైన పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇలా ఏటా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం ఒకే పంట సాగు చేస్తుండటంతో దిగుబడి పడిపోతుండటం, భూసారం తగ్గిపోతుండటంతో అన్నదాతలు నష్టాలు చవిచూస్తున్నారు. కాలానికి అనుగుణంగా వివిధ రకాల పంటలు సాగు చేయాలని, అధిక దిగుబడినిచ్చే, ధర లభించే పంటలు వేసుకోవడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

ఒకే పంట సాగుతో కలిగే నష్టాలు..

- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల ఆ లోతు వరకు ఉన్న పోషకాలు మాత్రమే వినియోగించుకుంటాయి.
- ఏటా ఒకే పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు మొక్కల బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గిపోతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట కూడా నాణ్యత ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ఎక్కువ లోతు వేర్లు ఉన్న పైరు, తక్కువ లోతుగల పంట ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. ఉదాహరణకు జొన్న-పప్పుశనగ, పత్తి-వాము
- నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి.

పంట మార్పిడితో లాభాలు..

పంట మార్పిడి విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో రైతుల ఏటా రబీ సీజన్‌లో అధిక శాతం ఒకే పంటను సాగు చేస్తున్నారు. చలికి పండే పంటలైన పప్పుశనగ, వాము, జొన్న వంటి పంటలు తప్పా మరే పంటలు సాగు చేయడం లేదు. దీంతో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీనిని నివారించేందుకు పంట మార్పిడి విధానం ఉత్తమం. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు ఒకసారి అనుభవంలోకి వస్తే ఆ విధానమే కొనసాగిస్తారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పంట మార్పిడి విధానంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.


మొలగవల్లి పొలాల్లో సాగు చేసిన పప్పు శగన పైరు (ఫైల్)

అవగాహన కల్పిస్తున్నాం



ఏటా ఒకే పంట సాగు చేయడం వల్ల కలిగే నష్టాలను రైతులకు తెలియజేస్తున్నాం. పంట మార్పిడి చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చు. చీడపీడల నివారణ తగ్గుతుంది. ఒక ఏడాది శనగ పంట వేస్తే మరో ఏడాది వాము లేదా జొన్న ఇతర పంటలు వేసుకోవాలి. దీంతో భూసారం పెరుగుతోంది. ఒకే పంట వేయడం వల్ల ఆ పొలంలో ఉన్న పురుగుల వృద్ధి పెరుగుతుంది. దీంతో పంట పెరిగే కొద్ది చీడపీడలు వెంటనే ఆశిస్తాయి. దీనికి తోడు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి.

– సునీత,ఏడీఏ,ఆలూరు

గ్రామాల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్


అరికెర,అరికెర తండా గ్రామాల్లో సీజ్ చేసిన బైక్‌లు, రింగు కర్రలు



ఆలూరు రూరల్: హొళగుంద మండలం దేవరగట్టు బన్ని ఉత్సవాల నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున ఆలూరు మండలంలోని అరికెర,అరికెర తండా గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐ శ్రీనివాస నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బన్ని ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామాల్లో ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా 25 రింగు కర్రలు, సరైన రికార్డులు లేని 12 బైక్‌లను సీజ్ చేశామన్నారు. మద్యం సేవించి రింగు కర్రలతో ఉత్సవాల్లో పాల్గొనరాదని సూచించారు. వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని గ్రామస్తులను హెచ్చరించారు. ఆలూరు, హొళగుంద, చిప్పగిరి,హాలహర్వి ఎస్ఐలు నరసింహులు, బాల నరసింహులు, రమేష్, చంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులు

తుగ్గలి : మండలంలోని రెండు పంచాయతీలకు బదిలీపై వచ్చిన కార్యదర్శులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జొన్నగిరి పంచాయతీకి నారాయణస్వామి, పగిడిరాయి పంచాయతీ కార్యదర్శిగా రాజునాయక్ బాధ్యతలు చేపట్టారు.

సంక్షిప్తం

ఇంటింటికీ కుళాయి

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామ బీసీ కాలనీలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి నీటి సమస్య నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాయంక్, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున తెలిపారు. సోమవారం గ్రామంలో జరుగుతున్న పైపులైన్ పనులను పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా బీసీ కాలనీలో నీటి సమస్య వేధిస్తుందని జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు పూర్తయ్యాయని పైపులైను పూర్తి చేసి నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. ఈఓ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి

మద్దికెర : మండలాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ సీవీ కొండయ్య అన్నారు. సోమవారం ఇటీవల బదిలీ వచ్చిన ఎంపీడీఓ సీవీ కొండయ్యను జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారి ఆంజనేయులు కలిసి అభినందించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు జెడ్పీ నిధులు సకాలంలో మంజూరయ్యేలా కృషిచేయాలని జెడ్పీటీసీని కోరారు.

రాయితీ శనగ విత్తనాల పంపిణీ

దేవనకొండ: మండలానికి 520 క్వింటాళ్ల రాయితీ పప్పు శనగ విత్తనాలు మంజూరయ్యాయని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలతో పాటు సబ్సిడీపై టార్పాలిన్‌లను కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు. ఏఓ సురేష్‌బాబు, టీడీపీ మండల కన్వీనర్ విజయ భాస్కర్‌గౌడ్, బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, వీవీఏలు మల్లికార్జున, రంగాచారి పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు సబ్సిడీ శనగ విత్తనాలను సోమవారం రైతులకు అందజేశారు. మండలానికి 4,550 క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, నాయకులు,సేనాపతి,నరసింహులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో మంచి భవిష్యత్

వెల్దుర్తి(కృష్ణగిరి): వృత్తి విద్యా కోర్సుల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని స్టేట్ ఒకేషనల్ కో-ఆర్డినేటర్లు కమలాకర్, విక్రమ్ తెలిపారు. వెల్దుర్తి గురుకుల పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల్లో ఇస్తున్న శిక్షణను సోమవారం పరిశీలించారు. ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన సహకారంతో వెల్దుర్తిలోని హోమ్ అప్లియన్సెస్ రిపేర్ షాప్స్, ఎలక్ట్రానిక్, ఐటీకి సంబంధించిన సంస్థల్లో జరుగుతున్న ఇంటర్నషిప్ తీరును పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వృత్తి విద్యా శిక్షకులు సౌజన్య, రాజమ్మ ఉన్నారు.

బన్ని ఉత్సవాన్ని సంతోషంగా జరుపుకోండి


నెరణికి వాసులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ప్రసాద్‌రాజు

హొళగుంద: దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాన్ని కలిసి మెలిసి సంతోషంగా జరుపుకోవాలని, పండుగ పూట రక్తపాతం వద్దని తహసీల్దారు ప్రసాద్‌రాజు సూచించారు. సోమవారం నెరణికి గ్రామంలో దేవరగట్టు ఉత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాళమల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవాన్ని సంప్రదాయంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకుందామన్నారు. మద్యం సేవించి, రింగు కర్రలతో ఉత్సవంలో పాల్గొనరాదని, దివిటీలను ఇష్టారాజ్యంగా తిప్పడం వల్ల భక్తులు గాయపడతారని ఇలాంటి చర్యలు సరికాదన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్‌ఓ నాగరాజు, ప్రహ్లాద పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి


మృతిచెందిన కాశిరాజు పద్మావతి

దేవనకొండ: పాము కాటుకు గురైన పద్మావతి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మండలంలోని కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన కాశిరాజు పద్మావతి (33) భర్త కాశిరాజు చిన్నరాముడితో కలిసి గ్రామంలోని గుడిసెలో జీవనం సాగిస్తున్నారు. ఈనెల 6న తెల్లవారుజామున 4 గంటల సమయంలో కాశిరాజు పద్మావతిని పాము కరిచింది. దీంతో ఆమెను కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం ఉదయం 8;30 గంటల సమయంలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవనకొండ సీఐ యుగంధర్ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆలూరు: వారంతా 23 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. నాటి తరువాత మళ్లీ సోమవారం కలుసుకోవడంతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా ఆహ్లాదకరంగా మారిపోయింది. మండలంలోని మొలగవెల్లి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001- 2002 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఉల్లాసంగా గడిపారు. యోగక్షేమాలు, కుశల ప్రశ్నలతో పాటు చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు ఆంజనేయులు,మధుసూదన్ ఆచారి,రమణయ్య, సీమా, రేఖాసాగర్ తదితరులకు పూర్వ విద్యార్థులు అనిల్‌రెడ్డి, కవిత, విమల, జయపాల్, జ్ఞానేశ్వర్ ఈరన్న తదితరులు ఘనంగా సన్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని తీర్మానించారు.

కుంటలో పడి వ్యక్తి మృతి


మంగలి ఆనంద్ (ఫైల్)

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామంలో మంగలి ఆనంద్ (39) పొలంలో పనులు చేస్తూ దాహం వేయడంతో నీటి కుంటలో నీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలో పడి మృతి చెందాడు. సోమవారం ఉదయం పొలం పనులకు వెళ్లి ఇప్పటి వరకు రాలేదని సాయంత్రం కుటుంబ సభ్యులు వెదకగా.. కుంటలో విగతజీవిగా కనిపించడంతో వారి రోధనలు మిన్నంటాయి. మృతుడికి భార్య ఉమాదేవి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ప్రమాదపు అంచున!


- వంతెన లేక అవస్థలు పడుతున్న అమృతాపురం ప్రజలు


ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటుతున్న వాహనదారులు, మహిళలు

హాలహర్వి: వర్షాలు వచ్చిన సమయంలో మండలంలోని అమృతాపురం గ్రామస్తుల కష్టాలు వర్ణనాతీతం. వర్షాకాలంలో వాగు ఉప్పొంగితే వాగుకు బ్రిడ్జి లేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పొలాలకు వెళ్లాలంటే ఈ దారిలోనే రాకపోకలు సాగించాలి. అలాగే సిద్ధాపురం, బల్లూరు నుంచి హొళగుందకు వెళ్లే వారికి కూడా ఇదే మార్గం. చిన్నపాటి వర్షం కురిసినా వాగు పొంగి పొర్లుతుండటంతో వాహనదారులు, రైతులు, కూలీలకు ఇక్కట్లు తప్పడం లేదు. నడిచి వెళ్లే వారు ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా, కాలుజారినా ప్రమాదంబారిన పడాల్సిందే. ఎద్దుల బండ్లు, బైకులు, ఆటోలు నీటిని దాటుకుంటూ వెళ్లే సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియక ఊపిరి బిగబట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెక్కల కష్టం బూడిదపాలు

మంత్రాలయం : ఓ రైతు రెక్కల కష్టం బూడిద పాలైంది. చేతికొచ్చిన పంట అనుకోకుండా దగ్ధమైంది. మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన చిన్న యేసేబు తెంపిన పత్తిని మిద్దెపై ఆరబోశాడు. విద్యుత్ సర్క్యూట్‌తోనో లేక ఇతర కారణాలతో అనుకోకుండా పత్తికి నిప్పు రాజుకుంది. చిన్నగా మంట వ్యాపించి మొత్తం పొగలు రావడంతో చుట్టుపక్కలా వాళ్ల గమనించి విషయం రైతుకు చెప్పారు. బాధిత రైతు వెళ్లి చూడగా పత్తి మొత్తం కాలిపోయింది. దాదాపు 10 క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు రైతు వాపోయాడు. చేతికొచ్చిన పంట బూడిదపాలు కావడంతో కన్నీరుమున్నీరయ్యాడు.


దగ్ధమైన పత్తి

పంచాయతీ వర్కర్లకు కనీస వేతనమివ్వాలి



అధికారులతో మాట్లాడుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి అశోక్, వయవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు యూసుఫ్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ అధికారులకు సమస్యలపై విన్నవించారు. వారు మాట్లాడుతూ ఐదు రోజులుగా విధులను బహిష్కరించి వేతనాల పెంపు కోసం అధికారులు, పాలకవర్గానికి పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా.. కార్మికుల కష్టాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నెలకు రూ.6 వేలు వేతనంతో నేటి అవసరాలతో పెరిగిన ధరలతో ఎలా జీవనం సాగించాలని ఈఓపీఆర్డీని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.18 వేలుగా ఉందని.. అయితే తమకు కనీసం రూ.12 వేలైనా ఇవ్వాలని కోరారు. కార్మికులు శాంతిరాజు, పులిరాజు, భార్గవ్, పెద్దయ్య, రాముడు, మధు, మండిగిరి రాముడు పాల్గొన్నారు.

మహాచండీదేవిగా అమ్మవారు


వెల్దుర్తిలో మహా చండీదేవిగా దర్శమిచ్చిన భువన గాయత్రీ మాతను దర్శించుకుంటున్న భక్తులు


పెరవలిలో మహా చండీదేవిగా రాజ్యలక్ష్మి


ప్రత్యేక అలంకరణలో మద్దమాంబ దేవి


పూజలందుకుంటున్న చౌడేశ్వరిదేవి


ఆస్పరిలో లలితా దేవిగా గాయత్రీదేవి



వేంకటేశ్వరస్వామిగా వాసవీ మాత


తుగ్గలిలో మహా చండీ దేవిగా దుర్గమాత



పత్తికొండలో పార్వతీదేవిగా సరస్వతీ దేవి, కన్యకాపరమేశ్వరి


కటారుకొండలో మహా చండీగా దుర్గమాత


వెల్దుర్తిలో అన్నపూర్ణా దేవిగా వాసవీ మాత

మద్దికెర: పెరవలి శ్రీరంగనాథస్వామి దేవాలయంలో సోమవారం రాజ్యలక్ష్మి దేవి అమ్మవారు మహాచండీదేవిగా అలంకరించడంతో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పూజారులు అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి మహామంగళ హారతి ఇచ్చారు. స్థానిక అలాగే చౌడేశ్వరీ దేవాలయంలో చౌడేశ్వరి దేవి, మద్దమాంబ దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

ఆస్పరి: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం రామతీర్థంలో వేలసిన పార్వతీదేవి, పంచముఖి గాయత్రీ మాత, మండల కేంద్రంలో వెలసిన కన్యకాపరమేశ్వరీ మాత, మారెమ్మవ్వ లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయాలలో పూజారులు గంగ,ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలూరు: స్థానిక కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో సోమవారం వాసవీమాతాను ఆలయ అర్చకులు మహేంద్ర ఆచార్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు ఉదయం గంగపూజ, ఆకుపూజ, పుష్ప, పంచామృతాభిషేకం మహా మంగళహారతి తదితర పూజలను చేపట్టారు.

తుగ్గలి(పత్తికొండ): దేవీ శవన్నరాత్ని మహోత్సవాలు వైభగంగా కొనసాగుతున్నాయి. ఐదవ రోజు సోమవారం పత్తికొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పార్వతీదేవిగా, సాయిబాబా ఆలయంలో సరస్వతీ దేవి.. పార్వతీదేవిగా, తుగ్గలిలో ప్రతిష్ఠించిన దుర్గమాత అమ్మవారిని మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే పురోహితులు అమ్మవార్లను ఆలంకరించి అభిషేకార్చనలు చేశారు. భక్తులు పూజల్లో పాల్గొన్ని అమ్మవార్లను దర్శించుకున్నారు.

కృష్ణగిరి: దేవీ శవన్నవరాత్రి మహోత్సవాలు కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో ఐదవ రోజైన సోమవారం అమ్మవార్లను ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు నిర్వహించారు. కటారుకొండ గ్రామంలో దుర్గమాత మహా చండీ దేవిగా, వెల్దురిలోని కన్యకాపరమేశ్వరి, భువన గాయత్రీ పార్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచే అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేవాలయాల వద్ద అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో కుంటే రామకృష్ణ, ఈశ్వరయ్య, నెంబి రాంబాబు, విజయభాస్కర్, రఘునాథ్‌రెడ్డి, లక్ష్మి సరోజ, మధు రాఘవేంద్రప్రసాద్, నూకల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.